సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 30 । ఆగస్టు । 2024



సిరులతల్లికి పంచామృతాభిషేకం

శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా కనక మహాలక్ష్మికి త్రికాల పంచామృతాభిషేక సేవ, విశేష హోమాలు నిర్వహించారు. 8లో



అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి స్వర్ణపుష్పార్చన వైభవంగా జరిగింది. 108 పుష్పాలతో పూజ నిర్వహించారు.



ఆకట్టుకున్న సీతాకోక చిలుక

జి.మాడుగుల: స్థానిక రామాలయం వీధిలో ఓ ఇంటి గోడపై వాలిన గోధుమ రంగులో గల సీతాకోక చిలుక ఆకట్టుకుంది.



వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలి

ఆస్పత్రులకు వచ్చే రోగులను కుటుంబ సభ్యులుగా భావించి వైద్యం అందిస్తాం. ప్రాణం పోసే వైద్యులకు పని ప్రదేశాల్లో రక్షణ చాలా ముఖ్యం.కోల్‌కతాలో డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్య ఘటన బాధాకరం.ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి. వైద్యులు, సిబ్బందికి భద్రత కల్పించాలి.

– ఎస్.రమేష్, వైద్యాధికారి,కిలగాడ పీహెచ్‌సీ, ముంచంగిపుట్టు మండలం

పటిష్టమైన చట్టాలు చేయాలి



కోల్‌కతాలో జరిగిన అత్యాచారం, హత్య ఘటన దారుణం.చట్టాలు బలహీనంగా ఉండడంతోనే వైద్యులపై తరుచూ దాడులు జరుగుతున్నాయి. అత్యాచారం చేసిన వారికి ఉరి శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలి. వైద్యులు,సిబ్బందిపై దాడులు జరగకుండా పటిష్టమైన చట్టాలు చేయాలి.రోగుల వెంట వచ్చే బంధువులను కట్టడి చేయాల్సిన అవసరం ఉంది.మహిళా ఉద్యోగుల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. – సీహెచ్.లలిత, స్టాఫ్ నర్స్, ఎస్ఎన్‌సీయూ ముంచంగిపుట్టు

న్యూస్‌రీల్

రేపు పింఛన్ల పంపిణీ

● కలెక్టర్ దినేష్ కుమార్

సాక్షి,పాడేరు: సెప్టెంబర్ నెలకు సంబంధించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఈనెల 31న పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించినట్టు కలెక్టర్ దినేష్‌కుమార్ గురువారం ఓప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 22 మండలాల్లోని 1,25,261 మంది పింఛన్ లబ్ధిదారులకు రూ.52,13, 92,500 ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈనెల 30వ తేదీ శుక్రవారమే ఎంపీడీవోలు పింఛన్‌నగదుడ్రా చేసి, 31న పంపిణీ చేయాలని ఆదేశించారు. సెప్టెంబర్ 1వతేదీ ఆదివారం ఉద్యోగులకు సెలవు దినం కావడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. శనివారం అందుబాటులో లేని పింఛన్‌దారులకు సోమవారం పంపిణీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

సరకుల సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం: ఆశ్రమ పాఠశాలలకు సరకులు సరఫరా చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని రంపచోడవరం ఐటీడీఏ ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం హెచ్చరించారు. ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలకు మూడు నెలల పాటు సరకులు సరఫరా చేసేందుకు గురువారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో టెండర్లు నిర్వహించారు. ఈసందర్భంగా పీవో మాట్లాడుతూ టెండర్లు పొందిన వారు ఆశ్రమ పాఠశాలలకు మూడు నెలలపాటు తాజా కాయగూరలు, కోడి మాంసం, అరటి పండ్లు, కోడిగుడ్లు ఎప్పటికప్పుడు సరఫరా చేయాలన్నారు. వెంటనే బిల్లులు సమర్పించాలని తెలిపారు. సరకుల సరఫరాలో సమస్యలు ఉంటే తన దృష్టి తీసుకు రావాలన్నారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సీహెచ్ శ్రీనివాస రావు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


● జేసీ డాక్టర్ అభిషేక్ గౌడ్



విద్యార్థులతో కలిసి క్రీడా ప్రతిజ్ఞ చేస్తున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్

పాడేరు: క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం లభిస్తాయని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే అభిషేక్ గౌడ్ తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం తలార్‌సింగి గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాల ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో జేసీ అభిషేక్ గౌడ్ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడాకారులు నిరంతర సాధన చేసి మంచి ప్రతిభ కనబరిచి జిల్లాకు, రాష్ట్రానికి కీర్తి ప్రతిష్టలు తేవాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి క్రీడా ప్రతిజ్ఞ చేశారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన డివిజన్ స్థాయి ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.పద్మావతి, క్రీడాప్రాధికార సంస్థ అధికారి జగన్‌మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం ఆలయాన్ని సందర్శించిన టీటీడీ ఇంజినీర్లు



వేంకటేశ్వరస్వామి ఆలయంలో టీటీడీ ఇంజినీర్లు

రంపచోడవరం : మండలంలోని ఐ.పోలవరం గోవిందగిరిపై తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మించి, నిర్వహిస్తున్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని గురువారం తిరుమల తిరుపతి దేవస్థానం ఇంజినీరింగ్ ఉన్నతాధికారులు జగదీశ్వరరెడ్డి, సురేంద్ర నాథ్‌రెడ్డి, రవిశంకర్ రెడ్డి,ఆనందరావు,నాగరాజు,శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న అర్చకస్వాముల క్వార్టర్ల నిర్మాణాన్ని, ఇప్పటికే జరిగిన ఆలయ నిర్మాణాన్ని, మిగిలిన పనులను పరిశీలించారు. స్వామి వారిని దర్శించుకుని, అర్చకులు పార్థస్వామి, వేదపండితుల సాయిరామ శర్మ నుంచి వేదాశీర్వాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, నారాయణ రాజు, సిబ్బంది, రంపచోడవరం ధర్మ ప్రచార భిక్ష మండలి కోఆర్డినేటర్ నల్లమిల్లి వెంకట రామారెడ్డి పాల్గొన్నారు.

‘ఏకలవ్య’లకు కొత్త భవనాలు

కార్పొరేట్ పాఠశాలలను తలదన్నే భవనాలు...అత్యాధునిక సదుపాయాలు...చుట్టూ పచ్చని కొండల మధ్య ఆహ్లాదకరమైన విశాల ప్రాంగణంలో సౌధాల సముదాయాలు ఆ ఏకలవ్య పాఠశాలలకు సమకూరాయి. దీంతో విద్యార్థుల కష్టాలు తీరనున్నాయి.

- **జిల్లాలో మూడు పాఠశాలలకు సొంత సౌధాలు**
- **కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా నిర్మాణాలు**
- **ప్రారంభోత్సవానికి సిద్ధమైన అరకులోయ, పెదబయలు,చింతపల్లి ప్రాంగణాలు**



పెదబయలులోని లకేపుట్టులో ఏకలవ్య పాఠశాల



మజ్జివలసలో ఏకలవ్య పాఠశాల భవనం

సాక్షి,పాడేరు: మన్యం బిడ్డలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం పాడేరు డివిజన్‌లో 10 మండలాల్లో ఇంగ్లిషు మీడియంతో కూడిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలను మంజూరు చేయడంతో అవన్నీ వేర్వేరు భవనాల్లో చాలీచాలని వసతుల మధ్య నడుస్తున్నాయి. దీంతో విద్యార్థులు అవస్థలకు గురవుతున్నారు. క్వార్టర్లు లేకపోవడంతో ఉద్యోగులు సమీపంలో ఇళ్లను అద్దెకు తీసుకుని రాకపోకలు సాగిస్తున్నారు.

మూడు పాఠశాలల భవనాలు పూర్తి

కేంద్ర ప్రభుత్వం ఒక్కో ఏకలవ్య పాఠశాల భవనానికి రూ.20కోట్ల చొప్పున తొలివిడతలో విడుదల చేయడంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్థలాలను కేటాయించి పనులను వేగవంతంగా చేయించింది. పెదబయలు మండలం లకేపుట్టు,అరకులోయ మండలం మజ్జివలస,చింతపల్లి మండల కేంద్రాలలో మూడు ఏకలవ్య పాఠశాలల నిర్మాణాలు ఇటీవల పూర్తయి,ప్రారంభోత్సవానికిసిద్ధమయయ్యాయి.జి. మాడుగుల,కొయ్యూరు,డుంబ్రిగుడ,ముంచంగిపుట్టు,పాడేరు మండలాల్లోని భవననిర్మాణాలు చురుగ్గా జరుగుతున్నాయి. హుకుంపేట, అనంతగిరి మండలాల్లోని ఏకలవ్యపాఠశాలలకు కూడా గత ప్రభుత్వం మార్చి నెలలోనే స్థలాలను కేటాయించింది.

కార్పొరేట్ స్థాయిలో సౌకర్యాలు

ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ విద్యాలయాలకు కార్పొరేట్ స్థాయిలో అన్ని సౌకర్యాలతో భవన నిర్మాణాలను నిర్మిస్తున్నారు.గిరిజన విద్యార్థులకు సౌకర్యాలతో కూడిన విద్యను అందించే లక్ష్యంగా ఏకలవ్య విద్యాలయాలు రూపుదిద్దుకుంటున్నాయి. విశాలమైన గదులతో కూడిన భవన నిర్మాణాలు జరుగుతుండడంతో ఆ భవనాలన్నీ చూపురులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ఒక్కో విద్యాలయంలో 6వతరగతి నుంచి ఇంటర్ వరకు తరగతులు నిర్వహిస్తారు. ప్రతి విద్యాలయంలోను 600మంది విద్యార్థులు ఉచిత వసతులతో కూడిన విద్యను అందించే లక్ష్యంగా ఏకలవ్యలు పనిచేస్తున్నాయి.

వచ్చేనెలలో ప్రారంభం

జిల్లాలో చింతపల్లి,పెదబయలు,అరకులోయ మండలాల్లో నిర్మాణాలు పూర్తి చేసుకున్న ఏకలవ్య విద్యాలయాల భవనాలు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో వీటిని సెప్టెంబర్ నెల మొదటి వారంలో ప్రారంభించనున్నారు. ఈమేరకు పాడేరు ఐటీడీఏ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అధునాతన సౌకర్యాలతో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు జిల్లాలో ప్రారంభం కానుండడంతో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. హుకుంపేట,అనంతగిరి మండలాల్లో నిర్మించనున్న ఏకలవ్య పాఠశాలలకు అదేరోజున ప్రధానమంత్రి భూమి పూజ చేయనున్నారు.



చింతపల్లిలో ఏకలవ్య పాఠశాల

గిరిజన విద్యార్థులకు వరం



కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన ఏకలవ్య పాఠశాలలు గిరిజన విద్యార్థులకు వరంగా మారాయి. కార్పొరేట్ స్థాయిలో భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం మూడు భవనాలను ప్రధానమంత్రి ప్రారంభిస్తారు.మిగిలిన మండల్లాలో భవన నిర్మాణాలను వేగంగా పూర్తి చేసే లక్ష్యంతో ఇంజినీరింగ్ అధికారులు ఆయా పనులను పర్యవేక్షిస్తున్నారు.

– వి.అభిషేక్, ఐటీడీఏ పీవో,పాడేరు

వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు

జేసీ అభిషేక్‌గౌడ్



గిడుగు రామమూర్తి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న జేసీ అభిషేక్‌గౌడ్, ఇతర అధికారులు

సాక్షి,పాడేరు: వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి అని, ఆయన సేవలు చిరస్మరణీయమని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే అభిషేక్‌గౌడ్ అన్నారు. గిడుగు రామమూర్తి జయంతిని గురువారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి జేసీ,ఇతర అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అడవుల్లో జీవనం సాగించే సవరలకు చదువు చెప్పాలనే సంకల్పంతో సవర భాషలో అనేక పుస్తకాలు రాశారని తెలిపారు. సొంత డబ్బుతో పాఠశాలలు పెట్టి చదువులు చెప్పించిన మహనీయుడు రామమూర్తి అని చెప్పారు. 1863 ఆగస్టు 29న జన్మించిన గిడుగు రామమూర్తి తెలుగు భాషాభివృద్ధికి ఎనలేని కృషికి చేశారని, ప్రతి ఏడాది ఆయన జయంతిని తెలుగు భాషాదినోత్సవంగా జరుపుకోవడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పద్మావతి, ఏవో అప్పారావు,డీటీ చిన్నికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విస్తారంగా వర్షాలు



పాడేరులో కురుస్తున్న వర్షం

సాక్షి,పాడేరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో రెండు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ముంచంగిపుట్టు, పెదబయలు,జి.మాడుగుల మండలాల్లోని మారుమూల ప్రాంతాలల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో గెడ్డలు,కొండవాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. పాడేరుతో పాటు అన్ని మండలాల్లో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు కొండపోడు, మెట్ట వ్యవసాయ పంటలకు అనుకూలమని రైతులు తెలిపారు. ఖరీఫ్‌లో వరినాట్లు కూడా చివరిదశకు చేరడంతో ఈ వర్షాలు మేలు చేస్తాయని హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం కురుస్తూనే ఉండడంతో జిల్లా కేంద్రం పాడేరులో జన జీవనానికి కాస్త అంతరాయం ఏర్పడింది.

వర్షపాతం వివరాలు

జిల్లాలో ముంచంగిపుట్టు మండలంలో అత్యధికంగా 48.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.పెదబయలులో 22.8, జి.మాడుగులలో 20.4, అనంతగిరిలో 18.4, అరకులోయ 16.2, హుకుంపేట 14, డుంబ్రిగుడ 12.6, మారేడుమిల్లి 6.2, జీకే వీధి 6, దేవీపట్నం 5.2, చింతపల్లి 4.2, కొయ్యూరు 4.2, రంపచోడవరం 3.8, పాడేరు 3.6, రాజవొమ్మంగి 3.2, గంగవరం 2.8, వై.రామవరం 2.8, చింతూరు 2.4, ఎటపాక 2, కూనవరం 2, వి.ఆర్.పురం మండలంలో 1.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

అప్రమత్తంగా ఉండాలి

- ఘాట్‌రోడ్లలో భారీ వాహనాలు నిషేధం
- వాగులు దాటొద్దు
- ఐటీడీఏలో నేడు వినతుల స్వీకరణ రద్దు
- కలెక్టర్ దినేష్ కుమార్



సాక్షి,పాడేరు: జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ గురువారం సూచించారు. వర్షాల కారణంగా పాడేరు ఐటీడీఏలో శుక్రవారం జరగాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను రద్దు చేసినట్టు పేర్కొన్నారు. మూడు రోజుల పాటు జిల్లాలోని అన్ని ఘాట్‌రోడ్లలోను భారీ వాహనాల రాకపోకలను నిషేధించినట్టు తెలిపారు. భారీ వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని, అవకాశం ఉంటే రాకపోకలను వాయిదా వేసుకోవాలని సూచించారు. జిల్లా,మండల స్థాయి అధికారులు వారి ప్రధాన కేంద్రాల్లో అందుబాటులో ఉండాలని, ప్రత్యేక కంట్రోల్‌రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. వర్షాల కారణంగా గెడ్డలు,కొండవాగుల ప్రవాహాలను దాటవద్దని కలెక్టర్ సూచించారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

తాటిచెట్లపాలెం(విశాఖ): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు రైళ్లకు తాత్కాలికంగా మరిన్ని అదనపు కోచ్‌లను జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. సంబల్‌పూర్–నాందేడ్(20809) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు సెప్టెంబరు 1 నుంచి 30వ తేదీ వరకు (రైలు నడిచే రోజుల్లో), నాందేడ్–సంబల్‌పూర్ (20810) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు సెప్టెంబరు 2 నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు (రైలు నడిచే రోజుల్లో) ఒక థర్డ్ ఏసీ ఎకానమీ, ఒక స్లీపర్ క్లాస్ కోచ్‌లను జతచేస్తున్నారు. సంబల్‌పూర్–ఈరోడ్ (08311) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు సెప్టెంబరు 4 నుంచి 25వ తేదీ వరకు (రైలు నడిచే రోజుల్లో), ఈరోడ్–సంబల్‌పూర్ (08312) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు సెప్టెంబరు 6 నుంచి 27వ తేదీ వరకు (రైలు నడిచే రోజుల్లో) ఒక థర్డ్ ఏసీ ఎకానమి, ఒక స్లీపర్ క్లాస్ కోచ్ జతచేస్తున్నారు.



చెన్నై–భువనేశ్వర్ స్పెషల్ రద్దు

నిర్వహణ పనుల నిమిత్తం చెన్నై–భువనేశ్వర్–చెన్నై స్పెషల్ రైళ్లు ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. సెప్టెంబరు 2, 9వ తేదీల్లో ఎంజీఆర్ చెన్నై సెంట్రల్–భువనేశ్వర్(06073) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, సెప్టెంబరు 3, 10వ తేదీల్లో భువనేశ్వర్–ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (06074) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌లు రద్దయ్యాయి.

ఇప్పుడు ముంపు లేదా?

రైల్వే జోన్‌కు ముడసర్లోవ భూములే ఫైనల్

రైల్వే జోన్ ఆలస్యం కావడానికి కారణం రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన భూమి ఇంకా రైల్వే శాఖకు అందలేదు – కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

జోన్‌కు భూములిచ్చేశామని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చెబుతోంది. కానీ ఇచ్చింది ముంపు భూమి. అది నిర్మాణాలకు పనికిరాదు – రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్

విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ నిర్మించాలని భావించాం. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం భూమి ఇవ్వలేదు. జోన్ పనులు ఎలా జరుతాయి.? : – తాళ్లపాలెం సభలో ప్రధాని నరేంద్రమోదీ

మనకు రైల్వే జోన్ వచ్చేది. జగన్ ప్రభుత్వం పనికిరాని స్థలం ఇచ్చేసింది. అందుకే జోన్ రాలేదు – అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు

ఇవన్నీ గత ఎన్నికల ముందు బీజేపీ, టీడీపీ నేతల వ్యాఖ్యలు.

- గత జనవరిలోనే రైల్వేకి అప్పగించిన నేటి ప్రభుత్వం
- అది ముంపు భూమి అంటూ బీజేపీ, టీడీపీ నేతల ఆరోపణలు
- జోన్ ఏర్పాటు చేయకుండా ఎన్నికల సమయంలో విమర్శలు
- ప్రత్యామ్నాయ భూములిస్తేనే నిర్మాణ పనులన్న మంత్రి అశ్వినీ వైష్ణవ్
- ఇప్పుడు అవే భూములకు ఓకే చెప్పిన రైల్వే మంత్రి

సాక్షి, విశాఖపట్నం : సౌత్ కోస్ట్ రైల్వే జోన్ కోసం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ ప్రకారం మిక్స్‌డ్ జోన్‌లో ఉన్న భూమిని అప్పగిస్తే.. కేవలం ఎన్నికల స్టంట్ కోసం కూటమి నేతలు అసత్య ప్రచారాలు చేశారు. ప్రజలను నమ్మించేందుకు ఏకంగా కేంద్ర మంత్రులు కూడా పదే పదే అబద్ధాలు వల్లె వేశారు. అబ్బే.. ఇచ్చింది ముంపు భూమి అంటూ విమర్శలు గుప్పిస్తూ జోన్ ఏర్పాటు చేయకుండా తప్పించుకున్నారు. ఇప్పుడేమో ఆ భూమి నిర్మాణాలకు ఓకే అంటూ రైల్వే అధికారులు ప్రకటించడం.. త్వరలోనే జోన్ ప్రధాన కార్యాలయం పనులు ప్రారంభిస్తామని రైల్వే మంత్రి చెప్పడం గమనార్హం.

అప్పుడు టీడీపీ ఏం చేసింది.?

రోడ్డు విస్తరణలో భాగంగా పెందుర్తి ట్రాన్సిట్ కారిడార్ మంజూరు చేసిన సమయంలో రోడ్డు నిర్మాణానికి, రైల్వే భూముల్లో తరాలుగా ఉన్న మురికివాడల అభివృద్ధికి మొత్తం 26.11 ఎకరాలు అవసరమయ్యాయి. దీనిపై రైల్వే అధికారులతో దఫ దఫాలుగా జరిపిన చర్చలు సఫలీకృతం కాలేదు. చివరికి 1:2 నిష్పత్తిలో అంటే 52.22 ఎకరాలు ముడసర్లోవలో ఇచ్చే ప్రతిపాదనకు రైల్వే అధికారులు అంగీకరించారు. ముడసర్లోవ స్థలం రైల్వేకి ఇచ్చేందుకు 2013 ఫిబ్రవరి 2న నం.55/12తో జీవీఎంసీ కౌన్సిల్‌లో తీర్మానం చేశారు. దీనిని ఆమోదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2015 నవంబర్ 26న జీవో ఎంఎస్ నం. 254 జారీ చేసింది. ముడసర్లోవలో సర్వే నెం.26లో జీవీఎంసీకి చెందిన సుమారు 270 ఎకరాలు పోరంబోకు ఉండగా, ఇందులో 52 ఎకరాలు రైల్వే శాఖకి అప్పగించేందుకు నిర్ణయించారు. అప్పట్లో రైల్వే అధికారులతో సంయుక్తంగా తనిఖీలు చేసి, వారు ఆమోదించిన తర్వాతే భూమి అప్పగింత చర్యలు చేపట్టారు. జీవీఎంసీ, రైల్వేల మధ్య 2013లో ఒప్పందం కుదిరితే 2014 నుంచి 2019 వరకూ ఐదేళ్లపాటు టీడీపీ ప్రభుత్వమే అధికారంలో ఉంది. అటు కేంద్రంలో కూడా ఉన్నది ఎన్డీయే ప్రభుత్వమే. అలాంటప్పుడు ఆ ప్రభుత్వాల హయాంలో ఈ భూములను రైల్వేకు ఎందుకు అప్పగించలేదంటే కూటమి నేతల దగ్గర సమాధానం లేదు.

‘మిక్స్‌డ్ జోన్’ అని చెప్పినా అసత్య ప్రచారం

వాస్తవానికి రైల్వేకు ఇచ్చిన ఈ స్థలం వీఎంఆర్డీఏ మాస్టర్ ప్లాన్ ప్రకారం మిక్స్‌డ్ జోన్ అని, ఏ విధమైన భవనాలైనా నిర్మించుకునేందుకు అనుకూలమని ధ్రువీకరించారు. ఆ భూమి చెరువు బ్యాక్ వాటర్‌లో లేదని, ముడసర్లోవ రిజర్వాయర్‌లో భాగం కాదని, ముంపునకు గురయ్యే అవకాశమే లేదని మాస్టర్‌ప్లాన్‌లో స్పష్టం చేశారు. ఈ విషయంపై రైల్వే అధికారుల నుంచి ఎలాంటి అభ్యంతరాలు, లేఖలు రాలేదు కూడా. అక్కడ ఉన్న ఆక్రమణల్ని తొలగించి స్థానికులతో సంప్రదింపులు చేసి.. సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించి రెవెన్యూ శాఖ మొత్తం స్థలానికి కంచె కూడా వేసింది. రైల్వేకు ఇవ్వాల్సిన 52.22 ఎకరాల భూమిని క్లియర్ టైటిల్‌తో సిద్ధం చేశారు. వాల్తేరు డీఆర్ఎంకు ఈ ఏడాది జనవరి 2న లేఖలు రాసి అప్పగించారు. కానీ అది ముంపు ప్రాంతమంటూ టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు అసత్య ప్రచారాలు చేశారు.



ముడసర్లోవలో రైల్వేకు అప్పగించిన భూములివే..

దాచేసిన శిలాఫలకం ఎక్కడ?

విశాఖ కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటుకు 2019లో కేంద్రం పచ్చజెండా ఊపింది. జోన్‌కు సంబంధించిన డీపీఆర్‌ని అదే ఏడాది ఆఖరిలో ఇచ్చేశారు. 2022లో ముందుగా జోన్ ప్రధాన కార్యాలయ నిర్మాణానికి డీఆర్ఎం కార్యాలయం ఎదురుగా ఉన్న వైర్‌లెస్ కాలనీని ఎంపిక చేశారు. అక్కడ ఉన్న 13 ఎకరాల్లో 8 ఎకరాల్లో హెడ్‌క్వార్టర్స్‌కు సంబంధించి డిజైన్లకు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆమోదముద్ర వేశారు. కాలనీని సైతం పరిశీలించారు. రూ.106 కోట్ల వ్యయంతో జోన్ ప్రధాన కార్యాలయానికి టెండర్లు పిలిచేందుకు సన్నద్ధమయ్యారు. టెండర్లు ఖరారు చేసిన తర్వాత అగ్రిమెంట్ జరిపి 36 నెలల్లో భవనాలను పూర్తి చేయాలని రైల్వే అధికారులు భావించారు. 2022 నవంబర్ 12న ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారనీ.. శిలాఫలకం కూడా సిద్ధం చేశారు. కానీ 11వ తేదీ అర్ధరాత్రి 12 గంటల తర్వాత శంకుస్థాపన కార్యక్రమాన్ని వాయిదా వేసేశారు. సిద్ధం చేసిన శిలాఫలకాన్ని దాచేశారు. దీనంతటికీ కారణం.. స్థానిక బీజేపీ, టీడీపీ నేతలే అనే ఆరోపణలు గతంలోనే వినిపించాయి. అప్పుడు శంకుస్థాపన చేస్తే క్రెడిట్ అధికారంలో ఉన్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కుతుందనే రాజకీయ కుట్రతో ఉత్తరాంధ్రవాసుల కలల్ని కల్లలు చేసేశారు. తర్వాత ముంపు భూమి పేరుతో రాజకీయాలు చేసి మోసం చేశారు.



చట్టాలను కఠినతరం చేయాలి

వైద్యులు, సిబ్బంది రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. విధి నిర్వహణలో కొందరు పేషెంట్లతో వచ్చేవారి నుంచి ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో మహిళా వైద్యులు, సిబ్బందికి రక్షణ కల్పించాలి. నిత్యం రాత్రి వేళల్లో పీహెచ్‌సీల వద్ద పోలీసు గస్తీని తప్పనిసరి చేయాలి. ప్రధానంగా మహిళలపై జరుగుతున్న దాడులపై ప్రభుత్వాలు చట్టాలను మరింత కఠినతరం చేయాలి.

– డాక్టర్ పద్మావతి, సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి, చింతపల్లి



ప్రాణదాతలకే రక్షణ లేదా?



ప్రజల ప్రాణాలను కాపాడే వైద్యులకు రక్షణ లేక పోవడం ఆందోళన కలిగిస్తుంది. కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచార ఘటన అమానుషం. ఈ ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలి. ఆసుపత్రిలో మహిళా వైద్యులు, సిబ్బంది రాత్రి పూట విధులు నిర్వర్తించే సమయంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ ఆసుపత్రులకు రాత్రి వేళ పోలీసులతో రక్షణ కల్పించాలి.

– డాక్టర్ వరప్రసాద్, వైద్యాధికారి, పీహెచ్‌సీ, లంబసింగి

క్లుప్తంగా

బాధిత విద్యార్థులకు చెక్కులు



విద్యార్థులకు చెక్కులను అందజేస్తున్న డీఆర్వో పద్మావతి

పాడేరు : అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని ఓ మిషనరీ వసతి గృహంలో జరిగిన కలుషిత ఆహార ఘటనలో అనారోగ్య బారిన పడి విశాఖలో చికిత్స పొంది అనంతరం పాడేరు ఆస్పత్రిలో కోలుకున్న ఇద్దరు విద్యార్థులు గురువారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. వీరికి పాడేరు కలెక్టరేట్‌లో డీఆర్వో బి.పద్మావతి రూ.50వేల చొప్పున చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా డీఆర్వో పద్మావతి మాట్లాడుతూ పరిహారం సొమ్మును సద్వినియోగం చేసుకోవాలన్నారు. గిరిజన విద్యార్థులు ఎవ్వరు అనధికార వసతి గృహాల్లో చేరవద్దని, ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటూ చదువుకోవాలని వారికి సూచించారు.

నేడు హైకోర్టు న్యాయమూర్తుల రాక

మహారాణిపేట(విశాఖ) : ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ చీమలపాటి రవి, జస్టిస్ టిఎస్ రవి శుక్రవారం విశాఖ వస్తున్నారు. రాత్రికి విశాఖలో బస చేస్తారు. ఈనెల 31న సిరిపురం చిల్డ్రన్స్ ఎరీనాలో మహిళా న్యాయవాదులు సదస్సులో పాల్గొంటారు.

ఏఎస్ఐ చిన్నయ్యకు కన్నీటి వీడ్కోలు



ఏఎస్ఐ చిన్నయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పోలీసు సిబ్బంది

హుకుంపేట: ముంచింగిపుట్టు పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తూ బుధవారం అనారోగ్యంతో మృతి చెందిన పాంగి చిన్నయ్యకు గురువారం మండలంలోని మఠం పంచాయతీ జాకరవలస గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ అమిత్‌బర్దర్ ఆదేశాల మేరకు హుకుంపేట, ముంచంగిపుట్టు ఎస్ఐలు సతీష్, రవీంద్రలు సిబ్బంది తదితరులు చిన్నయ్య మృతదేహానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. స్థానిక సర్పంచ్ మఠం శాంతకుమారి,బీజేపి నాయకులు మత్యకొండబాబు, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

చదువుల తల్లులు

- ఏజెన్సీ నుంచి వచ్చి కశింకోట ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులు
- నాగరికత.. చక్కటి బోధన అలవడతాయని ఆకాంక్ష
- గిరిప్రాంత చిన్నారులు చక్కగా చదువుతున్నారని ఉపాధ్యాయుల కితాబు

కశింకోటలోని బాలికల ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించడానికి ఏజెన్సీ ప్రాంత విద్యార్థులు మక్కువ చూపుతున్నారు. పాఠశాలలో ఉన్న విద్యార్థుల్లో సింహభాగం ఏజెన్సీ ప్రాంత విద్యార్థులే. మైదాన ప్రాంత నాగరికత, భాష అలవడతాయని వారు ఆసక్తి చూపుతున్నారు. సమీపంలో వసతి గృహం అందుబాటులో ఉండటంతో పాటు రవాణాకు అనువుగా ఉండటం కూడా ఇందుకు దోహదపడుతోంది.



కశింకోట బాలికల హైస్కూల్‌లో చదువుతున్న విద్యార్థులతో పాటు ఏజెన్సీ ప్రాంత బాలికలు

కశింకోట : అనకాపల్లి జిల్లా కశింకోటలోని బాలికల హైస్కూల్లో 730 మంది బాలికలు చదువుతున్నారు. వారిలో సుమారు 400 మంది అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన విద్యార్థులే ఉన్నారు. అరకు, పాడేరు, చింతపల్లి, హుకుంపేట తదితర ఏజెన్సీ ప్రాంతాల బాలికలు విద్యను అభ్యసిస్తున్నారు. వీరిలో ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర విద్యార్థులున్నారు. 3 నుంచి పదవ తరగతి వరకు వీరు ఇక్కడ చదువుతున్నారు. వీరికి తమ సమీపంలో అనేక స్కూళ్లు, వసతి గృహాలు అందుబాటులో ఉన్నప్పటికీ అక్కడ విద్యాభ్యాసం అంతగా బాగుండదని, నాగరికత అలవడదని, మైదాన ప్రాంత భాష ఒంట బట్టదని భావించి దూరం అయినప్పటికీ వచ్చి ఇక్కడ చేరుతున్నారు. ఇక్కడ పక్కనే సమగ్ర బాలికల వసతి గృహం అందుబాటులో ఉంది. దీనిలో సదుపాయాలు బాగుంటాయని వారు చెబుతున్నారు. అలాగే 3,4,5 తరగతుల విద్యార్థుల కోసం బాల సదనం అందుబాటులో ఉంది. దానిలో ఉంటూ ఏజెన్సీకి చెందిన పది మంది వరకు బాలికలు చదువుతున్నారు. కుటుంబానికి దూరంగా ఉంటే బాగా చదువుతారని తల్లిదండ్రులు భావిస్తున్నారు. దీంతో వారు ఇక్కడ తమ పిల్లలను చదివించడం పట్ల ఆసక్తి చూపుతున్నారు. ఇక ఏజెన్సీ ప్రాంత సంస్కృతిని ఇక్కడి విద్యార్థులకు రుచి చూపిస్తున్నారు. ఇటీవల ఏజెన్సీకి చెందిన థింసా నృత్యాన్ని ప్రదర్శించి తోటి బాలికల్లో ఆసక్తి రేకెత్తించారు. అంతే కాదు జిల్లా స్థాయి స్వాతంత్ర్య దినోత్సవ సంబరాల్లో థింసా నృత్యం ప్రదర్శించి అధికారుల ప్రశంసలు పొందారు. ఇలా ఇక్కడ చదివి వేష భాషలు నేర్చుకుంటూ తమ సంస్కృతిని కూడా పరిచయం చేస్తున్నారు.

ఏజెన్సీ పిల్లలు బాగా చదువుతున్నారు..

మా పాఠశాలలో ఎక్కువగా ఏజెన్సీ ప్రాంత విద్యార్థులు వచ్చి చదువుతున్నారు. సుమారు 400 మంది వరకు వాళ్లున్నారు. ప్రధానంగా మైదాన ప్రాంత భాష, సంస్కృతి, నాగరికత అలవర్చుకోవడం కోసం ఇక్కడికి వచ్చి చేరుతున్నారు. వారు చదువు పట్ల బాగానే శ్రద్ధ చూపుతున్నారు.

– ఎం.ఎస్. స్వర్ణకుమారి, హెచ్‌ఎం, బాలికల హైస్కూలు, కశింకోట.

ఇక్కడ చదివితే భవిష్యత్ బాగుంటుంది..



మాది వ్యవసాయ కుటుంబం. మా అమ్మాయిని దూరం అయినప్పటికీ మైదాన ప్రాంత సంస్కృతి, వేష భాషలు, నాగరికత అలవడతాయని, విద్యాభ్యాసం బాగుంటుందని భావించి చదివిస్తున్నాం. మా ప్రాంత పాఠశాలల్లో అయితే ఏజెన్సీ సంస్కృతి మాత్రమే అబ్బుతుంది. ఇక్కడ చేరిస్తే వారి భవిష్యత్ బాగుంటుందని చదివిస్తున్నాం.

– వనగాల సత్యనారాయణ, పేరెంట్, కొండవంచుల, చింతపల్లి మండలం.

ఇంటికి దూరంగా ఉంటే బాగా చదువుతారు..



దూరంగా ఉంటే బాగా చదువుకుంటుందని భావించి మా అమ్మాయిని ఇక్కడ చదివిస్తున్నాం. సమీపంలోనే వసతి గృహం ఉంది. రవాణాకు అనువుగా ఉంది. మా ప్రాంతానికి చెందిన వారు కూడా ఇక్కడే చదువుతున్నారు. వారు కూడా తోడుగా ఉంటున్నారు. దాంతో ఎలాంటి భయం లేకుండా ఇక్కడ చదివిస్తున్నాం.

– ఉడా చినతల్లి, పేరెంట్, వనగాల గ్రామం, కొయ్యూరు మండలం

విద్యాభ్యాసం బాగుంది..



మైదాన ప్రాంతంలో విద్యాభ్యాసం బాగుంటుందని, మంచి భాష, నాగరికత అలవడతాయని ఇక్కడ చదువుతున్నాం. ప్రస్తుతం నేను 8వ తరగతి చదువుతున్నాను. ఇక్కడ విద్యా బోధన కూడా బాగానే ఉంది. స్కూల్లో చాలా విషయాలు నేర్చుకుంటున్నాను.

– పాంగి జెర్సీ, విద్యార్థి, అరకు

ఇక్కడి బడి నచ్చింది..



మా అక్క ఇక్కడే చదివేది. అందుకే నేను ఇక్కడ చేరాను. ఇక్కడ విద్యా బోధన బాగుంటుంది. అందుబాటులో వసతి గృహం ఉంది. సౌకర్యవంతంగా ఉండటం, రవాణాకు అనువుగా ఉండటంతో మా తల్లిదండ్రులు ఇక్కడ మమ్మల్ని చేర్పించారు. ఇక్కడి చదువు, వాతావరణం నచ్చింది.

– కూడ తేజస్విని, విద్యార్థి, చింతపల్లి

సిరులతల్లికి పంచామృతాభిషేకం

25వ రోజుకు శ్రావణలక్ష్మి పూజలు



విశేష హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

డాబాగార్డెన్స్(విశాఖ): శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా బురుజుపేట కనకమహాలక్ష్మి దేవస్థానంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు గురువారం 25వ రోజుకు చేరాయి. అమ్మవారికి విశేష పూజలు, త్రికాల పంచామృతాభిషేక సేవ, విశేష హోమాలు నిర్వహించారు. విశిష్ట శ్రావణలక్ష్మీ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పరోక్షంగా పూజలు చేయదలచుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081కు పూజా రుసుం జమచేసి వారి పేరు, గోత్ర నామం, చిరునామాను 89855 15989కు వాట్సాప్ చేయాలి. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వెంపలి రాంబాబు, వేద పండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేకం

కనకమహాలక్ష్మి ఆలయంలో శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరగనున్న ఈ పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.500 చెల్లించాలి. వివరాలకు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

చివరి శుక్రవారం పూజలు నేడు

ఈ నెల 5 నుంచి ప్రారంభమైన శ్రావణ మాస పూజలు వచ్చే నెల 3తో ముగియనున్నాయి. నాలుగో శుక్రవారం నిర్వహించనున్న విశిష్ట సామూహిక కుంకుమ పూజలో పాల్గొనదలచే దంపతులు రూ.400 పూజా రుసుం చెల్లించాలి.

విషజ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

విశాఖపట్నం జోనల్ మలేరియా అధికారి డాక్టర్ శాంతిప్రభ



మలేరియా వ్యాధిగ్రస్తులతో మాట్లాడుతున్న మలేరియ అధికారి డాక్టర్ శాంతిప్రభ

హుకుంపేట: గిరిజన గ్రామల్లో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ తదితర వ్యాధులు అధికంగా సంభవిస్తున్న నేపథ్యంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని విశాఖ మలేరియా జోనల్ అధికారి డాక్టర్ శాంతిప్రభ అన్నారు. మండలంలోని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి, మండల కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ బాలురి పాఠశాలలో సందర్శించి అడ్డుమండలోని మలేరియా వ్యాధిగ్రస్తుల వద్దకు వెళ్లి వారికి అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో మాట్లాడుతూ మలేరియా జ్వరాల పట్ల వైద్య ఆరోగ్య సిబ్బంది, మలేరియ సిబ్బంది ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు.

మలేరియా స్ప్రేయింగ్ ముందుగా నిర్ణయించుకున్న ప్రణాళిక ప్రకారం ఉండాలని, గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని గిరిజనులకు కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ మోహన్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెలలో 'ఏకలవ్య' భవనాల ప్రారంభం

- వర్చువల్‌గా ప్రారంభించనున్న పీఎం
- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



పెదబయలులోని పాఠశాల పనుల వివరాలు తెలుసుకుంటున్న ఐటీడీఏ పీవో అభిషేక్



మజ్జివలసలో వివరాలు తెలుసుకుంటున్న పీవో అభిషేక్

పెదబయలు/అరకులోయ: జిల్లాలో నిర్మించిన ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల(ఈఎంఆర్‌ఎస్)ల భవనాలను భారత ప్రధాన మంత్రి వచ్చే నెలలో వర్చువల్‌గా ప్రారంభించనున్నారని పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ తెలిపారు. పెదబయలు మండలం సీతగుంట పంచాయతీ లకేపుట్టు సమీపంలో, అరకులోయ మండలం బొండం పంచాయతీ మజ్జివలసలో నిర్మిస్తున్న ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలల భవనాల పనులను గురువారం ఆయన పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెదబయలు, అరకులోయ, చింతపల్లిలలో ఈఎంఆర్‌ఎస్ పాఠశాలల భవనాలను వచ్చేనెల 5 నుంచి 9 తేదీల మధ్య ఏకకాలంలో ప్రారంభిస్తారని చెప్పారు.అంతర్గత రహదారులను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్మాణ సంస్థను ఆదేశించారు. లకేపుట్టులో ఎంపీపీ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుందని, కొత్త భవనాన్ని మంజూరు చేయాలని గ్రామస్తులు కోరగా పీవో సానుకూలంగా స్పందించారు. అరకులోయ మండలంలోని కొల్లభల్లుగుడలో అధికారులతో సమావేశమయ్యారు. పీఎం జన్‌మన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. గన్నెల గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలను సందర్శించి, కొద్ది సేపు టెన్త్ విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం చిన్నలబుడు పంచాయతీ పకనకుడి పీవీటీజీ గ్రామాన్ని సందర్శించారు. వచ్చేనెలలో నిర్వహించే పీఎం జన్‌మన్ కార్యక్రమం నిర్వహణకు అవసరమైన స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారులు వి.ఎస్.ప్రభాకర్, ఎం.వెంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ కె.వేణుగోపాల్,ఏఈ అభిషేక్, ఇంజినీరింగ్ ప్రాజెక్ట్స్ ఆఫ్ ఇండియా సంస్థ డీజీఎం డి.విశ్వనాథరావు, ఏజీఎం రవీంద్రనాథ్, ఎస్‌వి సత్యనారాయణ, గురుకుల కోఆర్డినేటర్ పి.ఎస్.ఎస్. మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వాయు'గండం' వస్తోంది

- తీవ్ర అల్పపీడనంగా విశాఖలోనే తీరం దాటే సూచనలు
- మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక
- 31న భారీ వర్షాలు కురిసే అవకాశం



ఎగిసి పడుతున్న అలలు

సాక్షి, విశాఖపట్నం : మహా నగరానికి వాయుగండం పొంచి ఉంది. విశాఖపట్నానికి తూర్పు ప్రాంతంలో ఉత్తర బంగాళాఖాతంలో గురువారం ఉదయం అల్పపీడనం ఏర్పడింది. ఇది సముద్రంలోనే బలపడి తీవ్ర అల్పపీడనంగా మారనుంది. నెమ్మదిగా కదులుతున్న ఈ అల్పపీడనం.. తీవ్ర అల్పపీడనంగా బలపడిన తర్వాత.. విశాఖ సమీపంలోనే తీరం దాటే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీంతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. భూభాగంలోకి వచ్చిన తర్వాత.. విశాఖ మీదుగా ప్రయాణిస్తూ.. తెలంగాణ వైపుగా కదులుతూ సెప్టెంబర్ 2న వాయుగుండంగా బలపడనుంది. ఓవైపు బలమైన గాలులు మరోవైపు గురువారం అర్ధరాత్రి నుంచి జిల్లా అంతటా భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయి. సెప్టెంబర్ 1వరకూ విస్తారంగా వర్షాలు కురుస్తాయి. తీరం వెంబడి గంటకు 45 నుంచి 55 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉందనీ.. ఈ గాలుల కారణంగా అలలు కూడా ఉవ్వెత్తున ఎగసిపడతాయని అధికారులు చెబుతున్నారు. మత్స్యకారులెవ్వరూ వేట కు వెళ్లరాదని హెచ్చరించారు. తూర్పుగోదావరి నుంచి శ్రీకాకుళం జిల్లా కవిటి వరకూ ప్రతి చోటా అలలు 1.2 నుంచి 1.9 మీ/సెకను వేగంతో తీరం వైపు దూసుకొస్తుంటాయని.. సందర్శకులు కూడా అప్రమత్తంగా వ్యవహరించాలని హెచ్చరిస్తున్నారు. పోర్టు, నేవీ, కోస్ట్‌గార్డ్ సిబ్బంది కూడా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్‌తో పాటు జీవీఎంసీ అలెర్ట్ అయింది. సహాయక చర్యలు అందించేందుకు ప్రత్యేక టీమ్‌లని అందుబాటులో ఉంచడంతో పాటు కంట్రోల్ రూమ్‌లని ఏర్పాటు చేసింది.

రోగులకు మెరుగైన సేవలందించాలి

ఐటీడీఏ పీవో సింహాచలం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐటీడీఏ పీవో సింహాచలం

రంపచోడవరం: ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎప్పటికప్పుడు మెరుగైన వైద్య సేవలు అందించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలంలోని నరసాపురం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పీవో సింహాచలం మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి ఆయా వ్యాధులకు ఉచిత మందులు రోగులకు అందజేయాలన్నారు. వివిధ రకాల వ్యాధులకు సంబంధించిన మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలన్నారు.

ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంతమంది వైద్యాధికారులున్నది, ఎంతమంది సిబ్బంది ఉన్నది, అదే విధంగా ప్రతిరోజు ఎంతమంది రోగులు వస్తున్నారు వంటి విషయాలను ఆరా తీశారు. పీహెచ్‌సీ లోపల, బయట ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పీహెచ్‌సీలో రాత్రి సమయంలో వైద్య సేవలు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం 39వ జాతీయ నేత్రదాన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. సుజిత, కృష్ణ పవర్, శ్యాం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సర్దుబాటు కౌన్సెలింగ్



ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

విశాఖ విద్య: జిల్లా విద్యాశాఖలో సర్‌ప్లస్ ఉపాధ్యాయులను అవసరమైన స్కూళ్లలో సర్దుబాటు చేసే నిమిత్తం గురువారం డీఈవో కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. మండల స్థాయిలో నిర్వహించిన వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో మిగిలిన ఉపాధ్యాయులను డివిజన్ పరిధిలోని పాఠశాలలకు పంపించారు. ఈ నేపథ్యంలో అవసరమైన ఖాళీలను గుర్తించిన విద్యాశాఖాధికారులు వాటిలో మిగులు ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు. విశాఖ, భీమిలి డివిజన్ల పరిధిలోని పాఠశాలలకు వీరిని కేటాయించారు. డిప్యూటీ డీఈవో సువర్ణ పర్యవేక్షణలో ఉపాధ్యాయుల వివరాలను ధృవీకరించుకున్న తరువాత ఖాళీలను ఎంపిక చేసుకునేలా వారికి వెసులుబాటు కల్పించారు. కొన్ని సబ్జెక్టుల జాబితాల్లో నెలకొన్న గందరగోళం దృష్ట్యా వాటిని వాయిదా వేసినట్లు తెలిసింది.

పదోన్నతుల్లో అవకతవకలపై విచారణ జరపాలి



సమావేశంలో మాట్లాడుతున్న కుంజా శ్రీను

రంపచోడవరం: స్థానిక ఐటీడీఏలోని గిరిజన సంక్షేమ విద్యావిభాగం (డీడీ కార్యాలయం)లో పదోన్నతుల ప్రక్రియ సక్రమంగా నిర్వహించడం లేదని, జరిగిన అవకతవకలపై విచారణ జరపాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను డిమాండ్ చేశారు. రంపచోడవరంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిప్యూటీ డైరెక్టర్లు(డీడీ) రోజుకొకరు మారడంతో ఆ శాఖలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు పదోన్నతుల ప్రక్రియ, సీఆర్‌టీ నియామకాలలో కలుగజేసుకుంటూ అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. గతంలో ఎనిమిది మందికి తప్పుడు మార్గంలో పదోన్నతులు కల్పించారని తెలిపారు. అందులో ఒక నాన్ ట్రైబల్ ఉపాధ్యాయుడికి అక్రమంగా పదోన్నతి కల్పించారని ఆరోపించారు. గత నెల 16 తేదీన జరిగిన పదోన్నతుల ప్రక్రియలో కూడా అవకతవకలు జరిగాయని ఆరోపించారు.డీడీ కార్యాలయంలో జరుగుతున్న అవకతవకలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.